క్లుప్తంగా

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఇందుపల్లి(గన్నవరం): ఉంగుటూరు మండలం ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహనన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉంగుటూరు ఎస్ఐ గోవిందు విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. పోక్సో యాక్ట్, శక్తి యాప్, సోషల్ మీడియాను ఎలా ఉపయోగించాలని అనే అంశాలపై అవగాహన కల్పించారు. సిగరెట్లు, మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



రామవరప్పాడు: నూతన పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడే విద్యార్థులు విజయాలు సాధించగలరని విజయ ఇంజినీరింగ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ తుమాటి వెంకటేశ్వరరావు అన్నారు. కళాశాలలోని అన్నీ విభాగాలకు చెందిన పలువురు విద్యార్థినులు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫ్రుమెంటేషన్ టెక్నాలజీ(ఎన్ఐఈఎల్ఐటీ) ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌కు ఎంపికవ్వడంతో అభినందించారు. పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పీ - 4లో ప్రైవేట్ స్కూల్స్ భాగస్వాములు కావాలి



గన్నవరం: పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పీ - 4లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కూడా భాగస్వాములు కావాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి షాహిద్‌బాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవాం నియోజకవర్గ స్థాయిలో పీ - 4పై ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ పీ - 4లో భాగంగా మానవత దృక్పథంతో ముందుకువచ్చి సమాజాభివృద్ధికి పాటుపడాలని చెప్పారు. గుడివాడ ఉప విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్, తహసీల్దార్ కె.వెంకటశివయ్య, ఎంపీడీఓ స్వర్ణలత, ఎంఈఓలు సాంబశివరావు, కమల, రాంబాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



బుద్దవరం(గన్నవరం): మండలంలోని బుద్దవరం శివారు రాజీవ్‌నగర్ కాలనీలో మంగళవారం కర్నాటి రామకృష్ణసాగర్ జ్ఞాపకార్థం అతని తల్లిదండ్రులు నాగార్జున, నాగలక్ష్మి దంపతులు 100 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గన్నవరం మాజీ సర్పంచి గూడపాటి తులసిమోహన్ చేతుల మీదుగా వీటిని వృద్ధులకు అందజేశారు. సర్పంచి బడుగు బాలమ్మ, విజయ డెయిరీ డైరెక్టర్ పాలడుగు నాని, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి గ్రేప్లింగ్ రెజ్లింగ్‌లో పతకాలు



పెద్దఆవుటపల్లి(గన్నవరం): రాష్ట్ర స్థాయి గ్రేప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లిలోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాల విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు కుసుమ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలోని బైరాగిపేటలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు జరిగిన ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 24 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించి 15 గోల్డ్ మెడల్స్, ఐదు సిల్వర్ మెడల్స్, నాలుగు కాంస్య పతకాలను గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో అత్యధిక పతకాలు సాధించి వరుసగా రెండో సారి తమ పాఠశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారన్నారు. తమ పాఠశాల పీటీఐ శ్రీనివాస్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ కోచ్‌గా అవార్డు ఇచ్చి సత్కరించినట్లు తెలిపారు. అనంతరం పతకాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు.

పట్టణ వాసులకు ఆహ్లాదం కరువు

- అధ్వానంగా కంకిపాడు గాంధీ పార్కు
- చెట్లు, వ్యర్థాలతో నిండిన ప్రాంగణం
- రాత్రిళ్లు మందుబాబులకు అడ్డా
- నిర్లక్ష్యంగా పంచాయతీ అధికారులు



కంకిపాడు గాంధీ పార్కు



చిట్టడవిని తలపిస్తున్న పార్కు ప్రాంగణం

కంకిపాడు: పార్కు అంటే గుర్తుకు వచ్చేది ఆహ్లాదభరిత వాతావరణం. కానీ ఆ పార్కులోకి అడుగుపెట్టాలంటేనే భయం. ఎక్కడ చూసినా వ్యర్థాల గుట్టలు, పెరిగిన పిచ్చి మొక్కలు, అధ్వానంగా ఉండే పరిసరాలు. దీనికి తోడు రాత్రిళ్లు మందుబాబులు పార్కును అడ్డాగా చేసుకుని మద్యం తాగుతున్నారు. ప్రాంగణంలోనే సీసాలను పడేస్తుండటంతో ప్రాంగణం అస్తవ్యస్తంగా మారింది. కానీ పంచాయతీ అధికారులు మాత్రం నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండల కేంద్రమైన కంకిపాడు బస్టాండు వెనుక వైపున గాంధీపార్కు ఉంది. కంకిపాడు పరిసరాలకు చెందిన సుమారు 40 గ్రామాల ప్రజలు వివిధ పనులనిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. సేద తీరేందుకు ఉన్న ఒకే ఒక్క అవకాశం గాంధీ పార్కు ప్రాంగణం. కానీ పార్కు ప్రాంగణంలో ఆహ్లాద భరిత వాతావరణం కరువైంది.

పిచ్చిమొక్కలు..వ్యర్థాల గుట్టలు

ఒకప్పుడు పచ్చని లాన్‌తో, ఆహ్లాదభరిత ప్రాంగణంతో ఉన్న గాంధీ పార్కు నేడు అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూసినా వ్యర్థాల గుట్టలు, పిచ్చిమొక్కలే దర్శనమిస్తున్నాయి. ఆదమరిచి మొక్కల్లోకి వెళితే ఏ విష కీటకం కరుస్తుందో తెలియని పరిస్థితి. కనీసం పచ్చని చెట్ల కింద కూర్చునే సదుపాయం కూడా పార్కులో లేకపోవటం బాధాకరం. దీనికి తోడు మందుబాబులు పార్కును తమ అడ్డాగా మార్చుకున్నారు. పగలు గంజాయి తాగే వాళ్లు, రాత్రిళ్లు మందుబాబులకు కేరాఫ్ అయ్యింది. మద్యం తాగిన సీసాలను ప్రాంగణంలోనే వదిలేయటం, పగలకొట్టడంతో పరిసరాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి.

నిర్లక్ష్యంగా పంచాయతీ అధికారులు..

పార్కుకు అతి సమీపంలోనే గ్రామ పంచాయతీ కార్యాలయం ఉంది. అక్కడే అధికారులు, పాలక వర్గ ప్రతినిధులు ఉంటారు. సమీపంలో ఉన్న పార్కులో అధ్వాన భరిత పరిస్థితులు ఏర్పడుతున్నా ఒక్కరూ పట్టించుకోవటం లేదు. నిర్లక్ష్యంగా మొద్దునిద్ర వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం ప్రాంగణాన్ని క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోవటం వల్లకూడా పార్కు ద్వారా ప్రజలు ఆహ్లాదాన్ని పొందలేకపోతున్నారు. అధికారులు నిర్లక్ష్య వైఖరిని వీడి పార్కును సుందరీకరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ అధికారులతో పాటు పోలీసులు కూడా మందుబాబుల ఆగడాల నుంచి నివారించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ప్రాంగణంలో పడి ఉన్న మద్యం సీసా

ఈ-పంటలో వివరాలు నమోదు చేసుకోవాలి



కంకిపాడు: రైతులు ఈ పంటలో పంట వివరాలను నమోదు చేసుకోవాలని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ వి.విజయభాస్కర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి వి.ఉషారాణి బాబూరావు సూచించారు. మండలంలోని తెన్నేరు, మారేడుమాక గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను రైతులతో కలిసి సందర్శించారు. శాస్త్రవేత్త విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయాధికారి బాబూరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తరుణంలో రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను ఈ-పంటలో నమోదు చేసుకోవటం తప్పనిసరి అన్నారు. వరిలో ప్రధానంగా కలుపు, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించుకోవాలన్నారు. కొత్త రకం వంగడాలైన ఎంటీయు 1443, ఆర్‌జిఎల్ 7034, 7038 మినీ కిట్స్‌తో పెంచిన నారుమడిని సందర్శించి జింకు, ఐరన్ లోపాలు ఉన్నట్లు గుర్తించారు. లోపాల నివారణకు అన్నబేధి పిచికారీ చేసుకోవాలని సూచించారు. చెరకు నాటే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బోడె నోరు అదుపులో పెట్టుకో

- వైఎస్సార్ సీపీ పెనమలూరు సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



కానూరులో మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేస్తున్న అవినీతిని ప్రజల పక్షాన తాను ప్రశ్నించానని, దానికి సమాధానం చెప్పకుండా ఉడత ఊపులు ఊపుతూ, బూతులు తిడితే చూస్తూ ఊరుకోనని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి హెచ్చరించారు. కానూరు పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో బోడె ప్రసాద్ మాట్లాడిన బూతు పురాణంపై ఫైర్ అయ్యారు. చక్రవర్తి మాట్లాడుతూ బోడె ప్రసాద్ చేస్తున్న ఇసుక దందా, రైతు బజార్ పేరుతో చేస్తున్న అక్రమాలు, రియల్ దాందా, మాఫియా కార్యకలాపాలపై ప్రజల పక్షాన ప్రశ్నించానన్నారు. తాను చేసి ఆరోపణలపై సూటిగా సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం లేక అవినీతిని కప్పిపుచ్చుకోవటానికి తనను బూతులు తిట్టడం విడ్డూరంగా ఉందన్నారు. బోడె ప్రసాద్ నోటికి వచ్చినట్లు మాట్లాడితే తానూ మాట్లాడగలనని, తాను తిట్ల పురాణం విప్పితే బోడె ఇంటి నుంచి బయటకు వచ్చి తిరగలేడని హెచ్చరించారు. రాజకీయాల్లో నీవు దద్దమ్మవని, 2008లో బోడె తన భార్యతో ఎంపీటీసీకి నామినేషన్ వేయించి అనుమోలు ప్రభాకర్ భార్య పోటీలోకి దిగటంతో తోక ముడిచావని, నీకు రాజకీయాల గురించి మాట్లాడే హక్కులేదని ఖండించారు. తమ కుటుంబానికి 50 సంవత్సరాల రాజకీయ చరిత్ర ఉందని, నోరు అదుపులో పెట్టుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం ప్రతిపక్ష పార్టీగా తాను ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. మరోసారి బోడె అడ్డూ అదుపు లేకుండా మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. గుగూల్‌లో కాల్‌మనీ సెక్స్ రాకెట్ పై ఉన్నదే తాను మాట్లాడానని, ఆ రోజు నీవు ఎక్కెక్కి ఏడవలేదా అని ప్రశ్నించారు. ఇసుకలో పందికొక్కులా తింటున్నారని, ప్రభుత్వ జీవోకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు వేమూరిబాలకృష్ణ, పి.రాఘవరావు, మందూరు కోటేశ్వరరావు, మాదు శ్రీహరిరాణి, పలువురు పాల్గొన్నారు.

మద్యం షాపు వద్ద ఘర్షణ

పెనమలూరు: గోసాల వద్ద మద్యం షాపులో ఘర్షణ జరగటంతో పోలీసులు ఇరువర్గాలపై మంగళవారం కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోసాల కనకదుర్గ వైన్స్‌లో కంకిపాడుకు చెందిన డ్రైవర్ సయ్యద్ అక్బర్, అతని మిత్రుడు పృథ్వీ మరి కొందరు మద్యం సేవించటానికి వచ్చారు. అయితే అదే సమయంలో అక్కడ ఉన్న రాజు, మరి కొందరు వ్యక్తులు తగాదాకు దిగి బీరు సీసాతో అక్బర్‌పై దాడి చేసి పారిపోయారు. కాగా ఈ ఘటనపై మరో వర్గం ఇచ్చిన ఫిర్యాదులో వణుకూరుకు చెందిన పి.ముఖేష్ మిత్రులతో కలిసి మద్యం సేవించటానికి రాగా అక్బర్ మరి కొందరు రత్నాకర్‌పై బీరు సీసాతో దాడి చేసి గాయపరిచారని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు.

నీటి వనరులపై అధ్యయనం అవసరం

పెనమలూరు: నీటి వనరుల రంగంలో ఆధునిక సాంకేతిక విధానాలపై విద్యార్థులు పరిశోధనలు చేయాలని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జీఎస్.శివకుమార్‌రెడ్డి అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం డాక్టర్ కేఎల్.రావు 124వ జయంతి కార్యక్రమం సందర్భంగా సివిల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో వాటర్ రిసోర్స్ రంగంలో రీసెంట్ ట్రెండ్స్ అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రాజెక్టుల రూపకల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. సివిల్ హెచ్ఓడీ డాక్టర్ వి.మల్లిఖార్జున, కోఆర్డినేటర్ హరూన్ ఆలీఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బోటనీ అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఉయ్యూరురూరల్: ప్రభుత్వ కాలేజీలో ఖాళీ లెక్చరర్ పోస్టుకు అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉయ్యూరు మండలం ఆకునూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌బీ రామలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. స్థానిక కళాశాల నందు పనిచేయుటకు వృక్ష శాస్త్రం(బోటనీ) ఎమ్మెస్సీలో 50 శాతం ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తులను కళాశాలలో అందించాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ద్విచక్ర వాహన దారులు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, లేని పక్షంలో జరిమానా విధిస్తామని హనుమాన్ జంక్షన్ ఎస్ఐ వి.సురేష్ హెచ్చరించారు. స్థానిక ప్రధానకూడలిలో మంగళవారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. రూల్స్ పాటించని వారికి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా నడుతున్న వ్యక్తులకు, త్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా దిచక్రవాహనాలు నడుపుతున్న 20 మందికి జరిమానా విధించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

లబ్ధిదారులతో నేరుగా సమీక్షించిన కేంద్ర బృందం



స్వయం సహాయక సంఘాల సభ్యులతో కేంద్ర బృందం ప్రతినిధులు

ఉయ్యూరురూరల్: సాక్షి దినపత్రికలో తూతూమంత్రంగా కేంద్ర బృందం పర్యటన కథనానికి కేంద్ర పరిశీలన బృందం స్పందించింది. మండలంలోని చిన్నోగిరాల గ్రామంలో మంగళవారం నిర్వహించిన పర్యటన ఆద్యంతం స్థానికులు, లబ్ధిదారులతో కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం నిధులను గ్రామ స్థాయిలో అమలు చేస్తున్న తీరును సంక్షేమ పథకాల విధివిధానాలను బహిరంగంగా తెలుసుకునేందుకు కేంద్ర పరిశీలన బృందం మండలంలోని చినబోగిరాల్లో మంగళవారం పర్యటించింది. ముందుగా స్థానికులతో, లబ్ధిదారులతో ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. సాక్షిలో ప్రచురించిన కథనానికి స్పందించి నేరుగా లబ్ధిదారులతోనే మాట్లాడి న్యాయబద్ధంగా ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా నిధులు ఖర్చు చేసే అంశంపై ఆరా తీసి నిశితంగా పరిశీలించారు. పర్యటనలో కేంద్ర బృందం పరిశీలకులు ప్రభాస్ శర్మ, లైసెనింగ్ ఆఫీసర్, ఉయ్యూరు తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు, పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు పరామర్శ



ఉప్పాల హారికను పరామర్శిస్తున్న ఎంపీపీ ప్రసన్నకుమారి, ప్రజాప్రతినిధులు

రామవరప్పాడు: కృష్ణాజిల్లా జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారికపై ఇటీవల జరిగిన దాడిని ఖండిస్తూ రూరల్ మండల ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు మంగళవారం పెడన మండలం కూడూరు గ్రామంలో మర్యాద పూర్వకంగా కలిసి పరామర్శించారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతుందన్నారు. దాడి జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లా ప్రథమ పౌరురాలికే ఇలా జరిగితే ఇక సామాన్య మహిళలకు ఈ కూటమి ప్రభుత్వంలో ఎటువంటి న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు సర్నాల రవి ఉన్నారు.

ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన శివరామప్రసాద్

గన్నవరం: ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి టి.శివరామప్రసాద్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శివరామప్రసాద్ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఓటర్ల జాబితా, పోలింగ్ బూత్‌ల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తాజా ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,80,109 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వీరిలో విజయవాడ రూరల్ మండలంలో 89,370, గన్నవరం మండలంలో 74,700, బాపులపాడు మండలంలో 72,120, ఉంగుటూరు మండలంలో 43,919 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. గత సాధారణ ఎన్నికల సమయంలో 306 పోలింగ్ కేంద్రాలు ఉండగా, అదనంగా రంగయ్యప్పారావుపేటలో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ప్రసాదంపాడు రైల్వే ట్రాక్ అవతల, వీరవల్లి శివారు నారాయణపురంలో ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని టీడీపీ నేత ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ కె.వెంకటశివయ్య, డెప్యూటీ తహసీల్దార్ కె.లక్ష్మీనాంచారమ్మ, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలి



ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ ఎలిజబెత్‌రాణి, ప్రజాప్రతినిధులు

గన్నవరం: గుడివాడలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారుపై దాడిచేసి ఆమెపై దౌర్జన్యానికి పాల్పడి అసభ్యకరంగా దూషించిన నిందితులను పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీధర్‌కు వైస్ ఎంపీపీ సాతులూరి శివనాగరాజకుమారి, ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవితో కలిసి ఆమె వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఈ ఘటన జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా నిందితులను పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. కేవలం అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు అరెస్ట్ చేసేందుకు వెనుకంజ వేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా పోలీసులు చట్టానికి కట్టుబడి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించండి



పెనమలూరులో ఎమ్మెల్యే ప్రసాద్‌కు సమస్యలు తెలుపుతున్న మహిళ

పెనమలూరు: పెనమలూరు దళితవాడలో రోడ్లు, డ్రైయినేజీలు నిర్మాణం చేయాలని స్థానికులు సమస్యలు విన్నవించారు. గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానికులు సమస్యలు తెలుపుతూ దళితవాడలో రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించాలని కోరారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్ట్ అర్ధంతరంగా పనులు ఆపాడని ఫిర్యాదు చేశారు. ఇకనైనా అభివృద్ధి పనులు దళితవాడలో చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ దళితవాడలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో బండి ప్రణవి, ఏవో కనకమైడల శైలజ, సర్పంచి లింగాల భాస్కరరావు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జ్ఞాన బోధ, ధ్యాన శిక్షణ ప్రారంభం

గన్నవరంరూరల్: ప్రకృతిని రక్షించుకోవటం మన పరమ ధర్మమని గన్నవరం సరస్వతీ పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు ఎం.నాగరమాదేవి అన్నారు. మండలంలోని జక్కులనెక్కలం శివాలయంలో పత్రీజీ అమృతోత్సవంలో భాగంగా మంగళవారం జరిగిన ఉచిత ధ్యాన శిక్షణ, జ్ఞాన బోధ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధ్యానంతో సమస్యలను అధిగమించటంతో పాటు, మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. ధ్యానం, జ్ఞానం మనిషిని ఉన్నత స్థితికి చేరుస్తాయని, ఆ కృషిలో భాగంగా పత్రీజీ అమృతోత్సవం 11 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామానికి చెందిన భక్తులు, పత్రీజీ ధ్యాన బృందం పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యతను అందిపుచ్చుకోవాలి



ఉయ్యూరు: పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యతను అందిపుచ్చుకోవాలని జెడ్పీ పాఠశాల హెచ్ఎం పీవీ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో స్కిల్ డే సందర్భంగా విద్యార్థులకు క్విజ్, రోల్ ప్లే, డ్రాయింగ్ అంశాల్లో మంగళవారం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. నైపుణ్యతా అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులతో హెచ్ఎం సుధారాణి

పెనమలూరు: ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలు పరిగణలోకి తీసుకొని అన్ని రంగాలపై విద్యార్థులు దృష్టి పెట్టి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని పెనమలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీబీకే సుధారాణి అన్నారు. పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ యువ నైపుణ్యాభివృద్ధి దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోని ప్రణాళిక బద్ధంగా చదవాలన్నారు. పరిశోధనల పై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందచేశారు. ఒకేషనల్ ట్రైనీ సింధు, సచివాలయం వీపీ లక్ష్మిప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సహకార సంఘాలు సేవలందించాలి



పెనమలూరు: గ్రామాల్లోని ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు రైతులకు ఉన్నతమైన సేవలందించాలని ఎమ్మెల్యే బోడెప్రసాద్ అన్నారు. పెనమలూరు సొసైటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం మంగళవారం జరిగింది. సొసైటీ అధ్యక్షుడిగా కిలారు శ్రీనివాసరావు, సభ్యులుగా నెప్పల్లి హరీష్, ఉప్పులూరి కేశవరావులతో కో ఆపరేటీవ్ మేనేజర్ తలశిల కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సర్పంచి లింగాల భాస్కరరావు, టీడీపీ సీనియర్ నాయకుడు మారుపూడి ధనకోటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోయా ఆనంద్‌ప్రసాద్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతులు పంటల బీమా చెల్లించాలి

పెద్దఆవుటపల్లి(గన్నవరం): ఉంగుటూరు మండలం పెద్దఆవుటపల్లి గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిసాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను ఏఓ జి.రమేష్ వివరించారు. ముఖ్యంగా ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. క్రాప్ లోన్ తీసుకున్న రైతులకు సంబంధిత బ్యాంక్‌లు పంటల బీమా కింద ప్రీమియం చెల్లిస్తాయన్నారు. పంటల బీమాతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పంట నష్టం అందుతుందని తెలిపారు. వీఏఏలు రఘు, మీనా, రసూల్ పాల్గొన్నారు.

18న నున్నలో విద్యుత్ అదాలత్

నున్న(విజయవాడరూరల్): ఏపీసీపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక, విజయవాడ వారి ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు ఈ నెల 18వ తేదీన నున్న గ్రామంలోని స్వప్న ఫంక్షన్ హాలు నందు నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అదాలత్ జరుగుతుందన్నారు.